

కూరగాయలు విక్రయించే మహిళతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

పరిశీలనలు.. పరిష్కారాలు.. పలకరింపులు

- హుస్నాబాద్‌లోని పలు కాలనీల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ మార్నింగ్ వాక్

హుస్నాబాద్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్‌లో గురువారం ఉదయం రవాణా, బీసీ, సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మార్నింగ్ వాక్ నిర్వహించారు. మంత్రి క్యాంపు కార్యాలయం నుంచి పలు కాలనీల గుండా ప్రజల సమస్యల తెలుసుకుంటూ, వినతులు స్వీకరిస్తూ ముందుకు సాగారు. పలు కాలనీల్లో ప్రజలు తమ సమస్యలను విన్నవించగా అధికారులతో మాట్లాడి అప్పటికప్పుడు పరిష్కరించారు. కూరగాయల విక్రయించే మహిళలు, పత్తి ఏరబోయే మహిళలను, రైతులను పలకరిస్తూ.. ఎంత కూలీ వస్తుందని, పత్తి పంట ఎలా ఉందంటూ అడిగి తెలుసుకున్నారు. హుస్నాబాద్‌లోని ప్రధాన రోడ్డు పనులు, ఆర్టీసీ బస్టాండ్ రెనోవేషన్ పనులను పరిశీలించారు. బస్టాండ్‌లోని ప్రయాణికులతో ముచ్చటించారు. అనంతరం బస్టాండ్‌లో దినపత్రికలను చదివారు. కొత్త రూట్లలో బస్సులు కల్పించాలని పలువురు మంత్రిని కోరగా మరిన్నీ బస్సులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రి వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ కేడం లింగమూర్తి, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, వల్లపు రాజు, చిత్తారి రవీందర్, కమిషనర్ మల్లికార్జున్, బంక చందు, తిరుపతి, రమేశ్‌నాయక్, బొంగోని శ్రీనివాస్, పున్న సది, వెన్న రాజు, తదితరులున్నారు.

సిద్దేశ్వర స్వామికి రుద్రకవచం సమర్పించిన మంత్రి

హుస్నాబాద్‌లోని అన్నపూర్ణ సమేత సిద్దేశ్వర ఆలయంలోని స్వామికి ఆరు కిలోల వెండి రుద్ర కవచాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో హోమం నిర్వహించారు. ముందుగా ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేసిన అనంతరం కాలినడకన సిద్దేశ్వర ఆలయం వద్దకు రుద్రకవచం తీసుకెళ్లారు. పూజా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, దేవాలయ చైర్మన్ మర్యాల రాజిరెడ్డి, కర్ణకంటి మంజుల, ఆంజనేయులు పాల్గొన్నారు.



సిద్దేశ్వర స్వామికి రుద్రకవచాన్ని తీసుకొస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

విద్యుదాఘాతంతో ఇద్దరు దుర్మరణం

- పొలానికి నీరు పెట్టి వస్తుండగా ఫ్లెక్సీ కట్టిన ఇనుప రాడ్ తగిలి షాక్
- మెదక్ జిల్లా కిష్టాపూర్‌లో అర్ధరాత్రి ఘటన
- ప్రమాదానికి సర్కారుదే బాధ్యత.. రూ.25 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలి: బీఆర్ఎస్ నేతలు

7



పచ్చిక మైదానాన్ని తలపిస్తున్న సిద్దిపేట పట్టణంలోని మచ్చవానికుంట

చెరువులపై నిర్లక్ష్యమేలా..!



సిద్దిపేటలోని ఎర్రచెరువు బతుకమ్మ ఘాట్ వద్ద అధ్వాన్న పరిస్థితి

- ప్రమాదకరంగా విస్తరించిన గుర్రపుడెక్క ● పచ్చిక మైదానాలను తలపిస్తున్న సిద్దిపేట చెరువులు

- బతుకమ్మ సందర్భంగా నిధులు ఖర్చుచేసిన వైనం
- అయినా.. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా తీరు
- తాజాగా గుర్రపుడెక్క ముంపులో పడి బాలుడి దుర్మరణం
- అధికారుల వైఖరిపై వెల్లువెత్తుతున్న విమర్శలు



గుర్రపుడెక్కపై దర్శనమిస్తున్న గాలిపటాలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, డిసెంబరు26 : సిద్దిపేటలోని ఎర్రచెరువుతో పాటు మచ్చవానికుంటలోని గుర్రపుడెక్కను తొలగించడానికి ఇటీవల బతుకమ్మ పండుగ సందర్భంగా నిధులు వెచ్చించారు. అప్పటికప్పుడు మొక్కుబడిగా పనులు చేపట్టి మమ అనిపించారు. దీంతో చెరువుల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారింది. ప్రస్తుతం ఎర్రచెరువు కూడా గుర్రపుడెక్కతో కళతప్పి దర్శనమిస్తోంది. పచ్చిక మైదానంలా కనిపిస్తోంది.'

> "సిద్దిపేట పట్టణంలోని మచ్చవానికుంటలో గుర్రపుడెక్క విపరీతంగా పెరిగింది. అది కుంటనా.. లేక పచ్చిక మైదానమా అన్నట్లుగా తయారైంది. తాజాగా తేజ అనే 5వ తరగతి చదువుతున్న బాలుడు గాలిపటం ఎగరేస్తుండగా అది కుంటలోని గుర్రపుడెక్కపై పడింది. ఎత్తుపల్లాలుగా గడ్డిలా దర్శనమిస్తున్న ఆ గుర్రపుడెక్క మొక్కలపై పడిన పతంగిని తీసుకునే క్రమంలో మునిగి గురువారం శవమై తేలాడు".

సిద్దిపేట పట్టణ నలువైపులా చెరువులు విస్తరించి ఉన్నాయి. ఇందులో కోమటిచెరువు రాష్ట్రంలోనే అతి సుందర పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతోంది. కోమటి చెరువుతో పాటు ఎర్రచెరువు, చింతల్‌చెరువు, నర్సాపూర్ చెరువు, మచ్చవానికుంటల అభివృద్ధికి గత ప్రభుత్వం మిషన్ కాకతీయ ద్వారా కృషి చేసింది. స్థానిక ఎమ్మెల్యే హరీశ్‌రావు నాడు నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఈ చెరువులను సుందరీకరించేలా చర్యలు చేపట్టి పనులు పూర్తిచేయించారు. కానీ చెరువులపై ప్రస్తుత అధికార యంత్రాంగం, మున్సిపాలిటీ పాలకవర్గం దృష్టి పెట్టకపోవడంతో అధ్వాన్నంగా తయారయ్యాయి.

నిధులు ఏమైనట్లు?

గడిచిన బతుకమ్మ వేడుకల సందర్భంగా సిద్దిపేటలోని చెరువుల పరిశుభ్రతకు నిధులు కేటాయించారు. కోమటిచెరువుతోపాటు ఎర్రచెరువు, మచ్చవానికుంటలకు ఖర్చుచేసినట్లు చెప్పుకొచ్చారు. ఈసారి కోమటిచెరువు వద్ద జరిగిన బతుకమ్మ వేడుకలపైనా విమర్శలు వెల్లువెత్తాయి. సరైన ఏర్పాట్లు చేయలేదని మహిళలు ఆరోపించారు. మెట్ల వద్ద కూడా శుభ్రం చేయకపోవడంతో బతుకమ్మలు తెచ్చిన పలువురు మహిళలు కిందపడిపోయిన సంఘటనలూ చోటుచేసుకున్నాయి. ఎర్రచెరువు, మచ్చవానికుంటల వద్ద కూడా ఇదే పరిస్థితి. బతుకమ్మ ఏర్పాట్లకు ముందు.. తర్వాత కూడా పెద్దగా మార్పులు కానరాలేదనే విమర్శలు వచ్చాయి. లక్షల రూపాయల్లో నిధులు

మిగతా 8వ పేజీలో...

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గజ్వేల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ మండల పరిధిలోని కొడకండ్ల సబ్‌స్టేషన్, 33 కేవీ లైన్లలో మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ప్రజ్ఞాపూర్ విద్యుత్ శాఖ ఏఈ సత్యం గురువారం ప్రకటనలో తెలిపారు. కొడకండ్ల సబ్‌స్టేషన్ పరిధిలోని కొడకండ్ల, రిమ్మనగూడ, దాతర్‌పల్లి, బూర్గుపల్లి, రాయవరం గ్రామాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

రాయితీపై మొక్కజొన్న విత్తనాలు

జగదేవ్‌పూర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఆహార భద్రత మిషన్‌లో భాగంగా రాయితీపై బయోసీడ్ 9544 హైబ్రిడ్ మొక్కజొన్న విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి వసంతరావు తెలిపారు. మండలంలో పత్తిసాగు చేసిన కొంతమంది రైతులు ఇప్పుడు దాని స్థానంలో మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నారన్నారు. 5 కేజీల ప్యాకెట్ పూర్తి ధర రూ. 1375కాగా, రూ.500 సబ్సిడీ పోను రూ. 875 చెల్లించి విత్తనాలు పొందవచ్చని తెలిపారు. రైతులు విత్తనాల కోసం వచ్చేప్పుడు తమ వెంట పట్టాదారు పాసుబుక్, ఆధార్‌కార్డ్ జీరాక్స్ తీసుకొచ్చి జగదేవ్‌పూర్‌లోని హనుమాన్ ట్రేడర్స్‌లో విత్తనాలు పొందాలన్నారు.

31వరకు ఏపీజీవీబీ సేవల్లో అంతరాయం

చేర్యాల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఏపీజీవీబీని 2025 జనవరి 1 నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా మార్చనున్న నేపథ్యంలో ఈ నెల 28 నుంచి 31 వరకు బ్యాంకు సేవలు, కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడనుందని కొమురవెల్లి ఏపీజీవీబీ మేనేజర్ మల్లేశం గురువారం ప్రకటనలో తెలిపారు. గతంలో కొన్ని జిల్లాలోనే ఉన్న ఈ బ్యాంకు సేవలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించారని పేర్కొన్నారు. సాంకేతిక సవరణల కారణంగా ప్రస్తుత సేవల్లో అంతరాయం కలుగుతుందని ఖాతాదారులు సహకరించాలని కోరారు.

ప్రాణాలు తీసిన రోడ్డు ప్రమాదాలు

- ఉమ్మడి జిల్లాలో వేర్వేరు చోట్ల నలుగురు మృతి



7

వినియోగంలోకి తెండి సారూ..

- నిరుపయోగంగా పాత మున్సిపల్ కార్యాలయ భవనం
- ప్రైవేట్ భవనాల్లో పోస్టాఫీసు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు



8

రెండో రోజూ కిటకిట

- సీఎస్ఐకి భక్తుల బారులు
- ఇన్‌చార్జి బిషప్ రూబెన్ మార్క్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు



7

మల్లన్న ఆలయానికి బ్రహ్మోత్సవ శోభ

- వడివడిగా కొనసాగుతున్న కల్యాణ ఏర్పాట్లు

చేర్యాల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయం బ్రహ్మోత్సవ శోభ సంతరించుకున్నది. మార్గశిరమాసం చివరి ఆదివారాన్ని పురస్కరించుకుని ఈనెల 29న స్వామివారి కల్యాణంతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరపనున్నారు. మూడునెలలపాటు సాగే ఉత్సవాలకు తెలంగాణతో పాటు మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ర్టాల నుంచి భక్తులు భారీగా తరలిరానుండడంతో ఆలయవర్గాలు ఏర్పాట్లు చేపట్టారు. కల్యాణం జరిగే తోటబావి వద్ద షామియానా, గ్యాలరీల ఏర్పాటుకు బారికేడ్లు, లైటింగ్ పనులు చేపట్టారు. రాజగోపురాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరిస్తున్నారు. స్వామివారి దర్శనంకోసం తరలివచ్చే భక్తులకు ప్రత్యేక, శీఘ్ర, ధర్మదర్శన క్యూలైన్లు ఏర్పాటుచేసి నీడకోసం తడకల పందిరి వేస్తున్నారు. గర్భాలయంలో మూలవిరాట్టుకు పంచరంగుల అలంకరణ చేస్తున్నారు. ఆలయానికి చేరుకునే మార్గాల్లో రన్నింగ్ లైటింగ్ తోరణాలు ఏర్పాటు చేశారు. నిన్న, మొన్నటివరకు ప్రశాంతంగా ఉన్న కొమురవెల్లిలో మల్లన్న పెళ్లి సందడి నెలకొంటున్నది.



తోటబావి ప్రాంగణంలో షామియానాలను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

సమీక్షించిన అదనపు కలెక్టర్

మల్లన్న కల్యాణానికి సంబంధించిన ఏర్పాట్లను అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ గురువారం పరిశీలించారు. పోలీసు, రెవెన్యూ, ఆలయవర్గాలతో సమీక్షించారు. గ్యాలరీలు, వేదికపై ఆసీనులయ్యే వీఐపీలు, ప్రజాప్రతినిధులు, డోనర్లు, మీడియా జర్నలిస్టుల పాసుల జారీ, ఇతరత్రా అంశాలపై చర్చించి పలు సూచనలు చేశారు.

కొమ్మూరి పరిశీలన

జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మల్లన్న కల్యాణ ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయ ప్రాంగణం నుండి కల్యాణ వేదిక వరకు వీధుల్లో కలియతిరిగారు. ఆయా ప్రదేశాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఆలయ వర్గాలకు పలు సూచనలు చేశారు. భక్తుల మనోభావాలకు భంగం కలిగించకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు.



దర్శన క్యూలలో భక్తులకోసం సిద్ధం చేస్తున్న చలువపందిరి

మేడమ్స్.. మేడమ్స్ ఒక్కసారన్న వచ్చిపోరా!

- పాట రూపంలో కస్తూర్బా విద్యార్థినుల ఆవేదన
- సమగ్రశిక్షా అభియాన్ ఉద్యోగుల సమ్మెతో కుంటుపడిన చదువు

తొగుట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు సమ్మెబాట పట్టడంతో కస్తూర్బా గాంధీ పాఠశాలల్లో విద్యాబోధన కుంటుపడింది. 16 రోజులుగా వారు సమ్మెలో ఉండటంతో తొగుట కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులు తమ బాధలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి వినూత్నంగా ఆలోచించారు. 'వానమ్మ... వానమ్మా... ఒక్కసారి అన్న వచ్చిపోవా' పాటను 'మేడమ్స్.. మేడమ్స్.. మేడమ్స్.. ఒక్కసారన్న వచ్చిపోరా' అంటూ పదో తరగతి విద్యార్థినులు పాటపాడి సోషల్‌మీడియాలో పెట్టడంతో అది కాస్త వైరల్‌గా మారింది. ఈ పాఠశాలలో 200 మంది విద్యార్థులకుగాను 13మంది ఉపాధ్యాయులు ఉన్నారు.



తొగుట కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో పాట పాడుతున్న విద్యార్థినులు



లాటరీ ద్వారా వివిధ శాఖలకు వీఆర్వోలను కేటాయిస్తున్న అధికారులు (ఫైల్)

సొంతగూటికి వీఆర్వోలు

- వివరాలు సేకరిస్తున్న జిల్లా యంత్రాంగం
- రెండేళ్ల పాటు ఇతర శాఖల్లో విధులు
- సర్కార్ నిర్ణయంతో చిగురిస్తున్న ఆశలు
- 173 వీఆర్వోలకు ఊరట!

సిద్దిపేట కలెక్టరేట్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోకి మళ్లీ వీఆర్వోలు (విలేజ్ రెవెన్యూ ఆఫీసర్) రానున్నారు. ఇటీవల అసెంబ్లీలో ఆమోదించిన భూభారతి బిల్లులో కొత్తగా గ్రామస్థాయిలో రెవెన్యూ అధికారులను నియమించనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు గ్రామాల్లో పనిచేసేందుకు రెవెన్యూ అధికారుల నియామకానికి ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. సర్వేయర్ల నియామకంపైనా దృష్టి పెట్టింది. గతంలో వీఆర్వో, వీఆర్ఏలుగా పనిచేసి ఇతర శాఖల్లోకి బదిలీ అయిన వారి నుంచి ఆప్షన్లను స్వీకరిస్తున్నది. తాజాగా సీసీఎల్ఏ నవీన్‌మిట్టల్ ఆన్‌లైన్‌లో వివరాలు నింపాలని, జిల్లాల వారీగా కలెక్టర్లు వివరాలను సేకరించాలని ఆదేశించారు. ఈ నెల 28లోగా వివరాలు అందజేయాలని స్పష్టం చేశారు.

వ్యవస్థ రద్దుకు నాలుగేళ్లు

వీఆర్వో వ్యవస్థను 2020లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రద్దు చేసింది. ఈ క్రమంలో కలెక్టర్ల ఆదేశాల మేరకు ఎమ్మార్వోలు వీఆర్వో నుంచి రెవెన్యూ, ఇతర రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. వీఆర్వోలు లేకుండానే పని సులువుగా చేయడానికి ప్రభుత్వం 'ధరణి' తీసుకొచ్చింది నాటి సర్కారు కీలక నిర్ణయంతో ఏళ్లుగా రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న వీఆర్వోలు ఇతర శాఖలకు బదిలీ అయ్యారు.

బాధతోనే వేరే శాఖలోకి..

ఏళ్లుగా రెవెన్యూ శాఖల వీఆర్వోలు పనిచేసిన వారు ఆ వ్యవస్థ రద్దు కావడంతో ఇతర శాఖలకు బాధతో వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఆగస్టు 2022లో అప్పటి సిద్దిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, అదనపు కలెక్టర్లు ముజామిల్ ఖాన్, శ్రీనివాస్‌రెడ్డి కలెక్టరేట్‌లో వీఆర్వోల సమక్షంలో లాటరీ ద్వారా వివిధ శాఖలకు 173 మంది విలేజ్ రెవెన్యూ ఆఫీసర్లను కేటాయించారు. వారంతా కూడా అయిష్టంగానే తమకు కేటాయించిన శాఖలో రిపోర్టు చేసి నేటి వరకు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇప్పటి వరకు ఆ శాఖలో సర్వీస్‌రూల్స్ అందుబాటులోకి రాకపోవడంతో పాటు ఇతర అలవెన్స్‌లు సైతం ఇవ్వకపోవడంతో అసంతృప్తిగా ఉన్నట్లు పలువురు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల వీఆర్వో వ్యవస్థను పూర్వ వైభవం

మిగతా 8వ పేజీలో...




మరమ్మతులకు ముందు నాగల్‌గిద్ద మండలం ముక్టాపూర్‌లో పాఠశాల, గోడలపై రంగురంగుల బొమ్మలు వేసిన దృశ్యం

పాఠశాలకు ఉపాధ్యాయుల చేయూత

● శిథిలావస్థకు చేరిన పాఠశాలకు మరమ్మతులు ● సొంత నిధులతో మొరం, పెయింటింగ్ పనులు చేయించిన టీచర్లు

నాగల్‌గిద్ద, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులంటే చదువు చెప్పడమే కాదు.. తాము పనిచేస్తున్న పాఠశాలకు కూడా చేయూతనిస్తామని నిరూపిస్తున్నారు సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద మండలం ముక్టాపూర్ గ్రామంలోని పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు. గ్రామంలోని పాఠశాల శిథిలావస్థకు చేరింది. దీంతో ప్రధానోపాధ్యాయుడు బాపుశెట్టి, ఉపాధ్యాయులు రమేష్, సంగమేశ్వర్, లింగమేశ్వర్ కలిసి పాఠశాల అభివృద్ధి కోసం రూ.70 వేల సొంత డబ్బులు ఖర్చుచేసి పాఠశాల ఆవరణలో భూమిని చదువును చేయించి, మొరంను వేయించారు. అలాగే పాఠశాలలోని గోడలకు రకరకాల బొమ్మలతో పెయింటింగ్స్ వేయించి, పాఠశాల రూపురేఖలనే మార్చేశారు. అంతేకాకుండా దాతల సహకారంతో విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగులను పంపిణీ చేయించారు. ఉపాధ్యాయులు చేస్తున్న పనికి గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుందాం

● మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



మాజీ డీఎస్పీ నళిని రచించిన వేదజ్ఞానం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు


గజ్వేల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుందామని మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. గజ్వేల్ మండలం పిడిచెడ్ గ్రామంలోని నిగమ-నీడమ్ వేద గురుకుల పాఠశాలలో మాజీ డీఎస్పీ నళిని సనాతన ధర్మంపై రచించిన వేదజ్ఞానం పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేద గురుకులాలు సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుతున్నాయని, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. మాజీ డీఎస్పీ నళిని దేశం కోసం, ధర్మం కోసం కృషి చేస్తున్నారని, ఆమె త్యాగం గొప్పదన్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులు వెంకటరమణ, కుడిక్యాల రాములు, ఎల్కంటి సురేశ్, బీజేపీ పట్టణ, మండల అధ్యక్షులు మనోహర్‌యాదవ్, పంజాల అశోక్‌గౌడ్, ఐలయ్యయాదవ్, సంపత్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, నర్సింహముదిరాజ్, అరవింద్, ప్రభాకర్, బీమ్‌కుమార్, మహేందర్, సత్యం, గణపతి, సాయి, కుర్ర స్వామి తదితరులున్నారు.


జపాన్ బృందంతో ఐఐటీహెచ్ ఒప్పందం




ఒప్పంద పత్రాలు చూపుతున్న ప్రతినిధులు

కంది, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పరిశోధనలు, మానవవనరులు, జీవన విధానం, విద్యా మార్పిడి కోసం కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్- జపాన్ దేశంలోని హమామట్సు సిటీ మేయర్‌తో ఒప్పందం చేసుకున్నారు. గురువారం జపాన్ ప్రతినిధుల బృందం ఐఐటీహెచ్‌ను సందర్శించింది. ఈ సందర్భంగా ఇరువర్గాలు ఒప్పందం చేసుకున్నాయి. ఈ సందర్భంగా హమామట్సు సిటీ మేయర్ యాసుకే నకనో ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తిలు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.

















సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

● సంగారెడ్డి జిల్లా షీటీం హెడ్ ముంతాజ్



అల్గోల్ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ముంతాజ్

జహీరాబాద్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : యువత సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సంగారెడ్డి జిల్లా షీటీం హెడ్ ముంతాజ్, పాఠశాల ప్రిన్సిపాల్ రాములు పేర్కొన్నారు. గురువారం మండలంలోని అల్గోల్ తదితర ప్రాంతాల్లో షీటీం బృందం సభ్యులు పర్యటించారు. అనంతరం అల్గోల్‌లో గల గురుకుల పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సైబర్‌క్రైం ప్రభావంతో ఎందరో నష్టపోతున్నారని గుర్తుచేశారు.మొబైల్‌కు వచ్చే అనుమానిత లింక్‌లు క్లిక్ చేయొద్దని చెప్పారు. ఈ కార్యక్రమంలో షీటీంబృందం సభ్యులు భరత్‌గౌడ్, దిలీప్, సాయిభరత్, సాయినాథ్, హరినేత్ర, మహేశ్, విజయ్‌కుమార్, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తూప్రాన్‌లో గోమాతకు సీమంతం



తూప్రాన్‌లో గోమాతకు సీమంతం నిర్వహిస్తున్న దృశ్యం

తూప్రాన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్‌లో గోమాతకు గురువారం శ్రీమంతం చేశారు. మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో నివాసముండే ఆర్ఎంపీ వైద్యుడు ప్రసాద్ కొన్నినెలల క్రితం ఆవును తీసుకొచ్చి పెంచుకుంటున్నాడు. ఇంటికి గోమాత రావడంతో అన్నీ శుభాలు జరుగుతుండటంతో ఇంట్లో సభ్యుడిగా పెంపకం చేపట్టారు. గోమాత ఐదునెలల గర్భం దాల్చడంతో గురువారం గోమాతకు పూలమాలవేసి పూజలు నిర్వహించారు. చీర సారె సమర్పించి శ్రీమంతం చేశారు. శ్రీమంతానికి స్నేహితులను ఆహ్వానించారు. గోమాతను రక్షించాలని శ్రీమంతం నిర్వహించినట్లు ప్రసాద్ వివరించారు.

వీఆర్‌వో వ్యవస్థ పునరుద్ధరణ ప్రకటనపై హర్షం



సంగారెడ్డిలోని ఐబీలో స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్న పూర్వ వీఆర్‌వోలు

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పూర్వ వీఆర్‌వో వ్యవస్థను పునరుద్ధరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వీఎల్‌వో పేరుతో పోస్టులు భర్తీ చేసేందుకు నిర్ణయించినందుకు పూర్వ వీఆర్‌వోలు హర్షం వ్యక్తం చేశారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ అతిథి గృహంలో గురువారం స్వీట్లు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిక్రూట్‌మెంట్ ద్వారా కాకుండా అర్హులైన వీఆర్‌వో, వీఆర్‌ఏలను తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోందని, దీనికోసం డిగ్రీ, ఇంటర్‌లోపు చదివిన వారు ఎవరైనా ఆసక్తి గల వారు ముందుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, వెంకటయ్య, హుస్సేన్, వెంకన్న, శంకరయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రామాయంపేటలో చిరుజల్లులు

రామాయంపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రామాయంపేటలో గురువారం సాయంత్రం చిరుజల్లులు కురిశాయి. ఈ ఉదయం మంచు, మధ్యాహ్నం ఎండ, సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఊహించని విధంగా చిరుజల్లులు కురవడంతో జనం బయటకు రాలేకపోయారు. చలికాలంలో వర్షాలు కురవడం ఏంటని ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. రైతులు ఎలాంటి పంటలు విత్తకపోవడంతో పంటలకు ఇబ్బందులు ఏర్పడలేదు.

నేడు విద్యుత్ నిలిపివేత

మునిపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : తాటిపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని తాటిపల్లి, పెద్దలోడి, చిన్నలోడి, చీలపల్లి, కల్లపల్లి బేలూర్, మక్తక్యాసారం గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం కలిగించే చెట్లను నరికివేస్తున్న కారణంగా శుక్రవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు మండల విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

డబుల్.. ట్రబుల్..!

ఇళ్లు ఇచ్చినా.. చేతికందని పట్టా



కొల్లూరు డబుల్‌బెడ్‌రూం మెగా టౌన్‌షిప్

- కార్యాలయం చుట్టూ తిరుగుతున్న లబ్ధిదారులు
- సంగారెడ్డి ఆర్డీవో బీరువాలో మూలుగుతున్న పట్టాలు
- మరో వైపు ఇళ్లలో చేరాలని హెచ్చరికలు..
- ఈ నెల 31 వరకు డెడ్‌లైన్

పటాన్‌చెరు, డిసెంబరు, 26 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన డబుల్ ఇండ్లు అందని ద్రాక్షగా మారుతున్నాయి. ఇళ్లు కేటాయించినా.. పట్టాలు చేతికి అందకపోవడంతో లబ్ధిదారులు వాటిని సొంతం చేసుకోలేకపోతున్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కొల్లూరులో ఇళ్లు లేని పేదల కోసం సుమారు 28 వేల ఇళ్లను పటాన్‌చెరు నియోజకవర్గపరిధిలో రింగ్ రోడ్డుకు లోపల నిర్మించారు. ఇక్కడ సుమారు 28 వేల డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించగా, 60 శాతం మంది లబ్ధిదారులు మాత్రమే ఇళ్లలో చేరారు. అమీన్‌పూర్‌లో 1836 మంది లబ్ధిదారులకు 15 వందల మంది మాత్రమే ఫ్లాట్లలో ఉంటున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు లబ్ధిదారులను ఎంపిక చేసి, వారికి పట్టాలను పంపిణీ చేశారు. ఇందులో సంగారెడ్డి జిల్లాలోని.. జీహెచ్ఎంసీ పరిధిలోని పటాన్‌చెరు, రామచంద్రాపురం, భారతీనగర్ డివిజన్లకు చెందిన లబ్ధిదారులూ ఉన్నారు. లబ్ధిదారులకు పట్టా సర్టిఫికెట్లు మాత్రం చేతికి అందలేదు. దీంతో ఏడాదిగా వారు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయితే, మిగిలిన ఫ్లాట్లలో లబ్ధిదారులు చేరేందుకు తొలుత ఈ నెల 5న డెడ్‌లైన్‌గా పెట్టారు. తర్వాత దానికి ఈ నెల 31 వరకు పొడగించారు. అయితే, లబ్ధిదారుల్లో చాలామందికి ఇంకా పట్టాలు చేతికి అందకపోవడంతో తాము ఇళ్లలో చేరాలో వద్దో తేల్చుకోలేకపోతున్నారు. లబ్ధిదారులుగా ఎంపిక చేసినా.. పట్టాలు లేకపోవడంతో వారి పరిస్థితి దిక్కుతోచకుంది.

కొంతమందికే పట్టాలు..

పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీ వ్యవహారం అంతా హడావిడిగా సాగింది. ఎన్నికలకు కొద్ది రోజుల ముందు లబ్ధిదారులను ఆఘమేఘాల మీద ఎంపిక చేశారు. అప్పటి ప్రజా ప్రతినిధులు సమావేశాలు పెట్టి కొంత మంది లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. మిగిలిన వారికి కార్యాలయాల్లో అందజేస్తామని చెప్పారు. అంతలోనే అసెంబ్లీ ఎన్నికలు, తర్వాత పార్లమెంట్ ఎన్నికల కోడ్ రావడంతో పట్టాలు ఎక్కడ ఉన్నాయో.. ఎవరికి అడగాలో తెలియని అయోమయంలో లబ్ధిదారులు పడిపోయారు. అయితే, లబ్ధిదారుల సెల్‌ఫోన్లకు పట్టాలు తీసుకెళ్లాలనే సమాచారం ఇచ్చినట్లు అధికారులు చెబుతున్నా.. చాలా మంది లబ్ధిదారుల వద్ద దరఖాస్తు చేసుకున్న నాటి సెల్ ఫోన్లు లేకపోవడం, కరోనా.. ఇతర పరిస్థితుల కారణంగా పలువురు స్వగ్రామాలకు వెళ్లడంతో వారికి సమాచారం అందక పట్టాల పంపిణీ కార్యక్రమానికి రాలేదు. ఇదే వారికి శాపంగా మారింది.

సంగారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో..

వందలాది మంది లబ్ధిదారులకు సంబంధించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల పట్టాలు ఇప్పుడు సంగారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో ఉన్నాయి. తొలుత తహసీల్దార్ల ఆధీనంలో ఉన్న పట్టాలను తర్వాత ఆర్డీవో కార్యాలయానికి తరలించారు. అయితే, లబ్ధిదారులు తహసీల్ కార్యాలయాల్లో సంప్రదిస్తే సంగారెడ్డి ఆర్డీవో కార్యాలయానికి వెళ్లాల్సిందిగా సూచిస్తున్నారు. జాబితాలో పేరు, ఆధార్ కార్డు, ఇతర గుర్తింపు పత్రాలు చూసి తమకు ఆక్యుపెన్సీ ఇవ్వాలని లబ్ధిదారులు కోరుతున్నా.. పట్టాలు తేస్తే తప్ప సర్టిఫికెట్ ఇవ్వలేమని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ కల్పించుకుని లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. అలాగే, ఇటీవల ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అధికారులను కలిసి కేటాయించకుండా మిగిలిపోయిన ఇళ్లను నియోజకవర్గంలోని అర్హులైన పేదలకు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో తమకు న్యాయం చేసేందుకు ఎమ్మెల్యే చేయూతనివ్వాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి

డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల జాబితాలో పేర్లు ఉన్న వారి పట్టాలు తమ వద్దే ఉన్నాయి. వారికి పట్టాలను అంజేయాలంటే ప్రభుతం నుంచి తమకు ఆదేశాలు జారీ కావాలి. అనివార్య కారణాల వల్ల పట్టాలను తీసుకోని లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం అయ్యేలా చేస్తాం.

- రవీందర్, ఆర్డీవో, సంగారెడ్డి

ఇక్కడ 'డబుల్' తిప్పలు

వెల్దుర్తి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండల కేంద్రంలోని డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులు కనీస సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. పనులు పూర్తి కాకుండానే ఇళ్లను కేటాయించడంతో వాటిలో ఉండలేకపోతు న్నారు. మండల కేంద్రమైన వెల్దుర్తికి 100 డబుల్ బెడ్‌రూమ్‌లు మంజూరు కాగా, ఒక చోట సింగిల్‌గా 36 ఇళ్లు, మరోచోట జీ ప్లస్ వన్‌లో ఎనిమిది బ్లాక్‌లను నిర్మించారు. అందులో ఒక బ్లాక్‌కు సంబంధించి జోర్‌లు రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఏర్పాటు చేయలేదు. అలాగే ఎనిమిది బ్లాక్‌లకు సంబంధించి డ్రైనేజ్ వ్యవస్థ విద్యుత్ సౌకర్యం, వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేయకపోవడంతో లబ్ధిదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రెండేళ్ల క్రితం జిల్లా అదనపు కలెక్టర్ డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలించి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించినా.. ఎలాంటి స్పందన లేకుండా పోయింది.



డ్రైనేజీ పైప్‌లైన్ కనెక్షన్ ఇవ్వకుండానే వదిలేసిన దృశ్యం

కరెంట్.. డ్రైనేజీ కనెక్షన్లు ఇవ్వలే..



డబుల్ బెడ్ రూం ఇళ్లకు విద్యుత్ సదుపాయం కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో అధికారులు విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయలేదు. దీంతో లబ్ధిదారులు కాళ్లరిగేలా తిరగడంతో చివరికి అధికారులు మీటర్లు ఏర్పాటు చేసినా కనెక్షన్లు మాత్రం ఇవ్వలేదు. ఇక జీ ప్లస్ వన్ పద్ధతిలో నిర్మించిన ఇళ్లకు డ్రైనేజీ వ్యవస్థ లేదు. ఇండ్ల నుంచి బయట వరకు పైప్‌లైన్‌లను వేసి సంపు కనెక్షన్ ఇవ్వలేదు. దీంతో డ్రైనేజీ పైప్‌లలో మురుగు నిండి దుర్గంధం రావడమే కాకుండా మురుగు నీరు పోకపోవడంతో పైప్‌లైన్‌లు నిండిపోతున్నాయి. మొత్తం వంద డబుల్ ఇండ్లకు ప్రత్యేకంగా ట్యాంకును నిర్మించి కనెక్షన్‌లను ఇచ్చారు. ఈ ట్యాంకుకు మిషన్ భగీరథ కనెక్షన్ మాత్రమే ఉండడంతో భగీరథ నీరు సరఫరా అయిన రోజు మాత్రమే అరకొరగా నీరు వస్తుంది.

బోరుబావికి నిధులు మంజూరు...

డబుల్ ఇడ్లలో తాగునీటి కోసం బోరు బావితో పాటు ట్యాంకు కనెక్షన్ కోసం రూ. 2.50 లక్షల మంజూరు అయ్యాయి. కానీ, బిల్లులు రావడం లేదని కాంట్రాక్టర్ ఎవరు ముందు రాకపోవడంతో పని జరగడం లేదు. త్వరలోనే బోరుబావి తవ్వించి తాగునీటి సమస్య తీరుస్తాం.

- శ్రీకాంత్, పంచాయతీరాజ్ ఏఈ..

కేసీఆర్‌ను కలిసిన డీసీసీబీ మాజీ డైరెక్టర్



మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో బట్టు అంజిరెడ్డి కుటుంబసభ్యులు

మర్కుక్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి గురువారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎర్రవల్లిలోని ఆయన వ్యవసాయ క్షేత్రంలో కలిశారు. అంజిరెడ్డి కుమార్తె సహస్ర పుట్టిన రోజు సందర్భంగా అంజిరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి ఆశీర్వాదం తీసుకున్నారు. అంజిరెడ్డి పదేళ్లుగా కేసీఆర్ వ్యవసాయ క్షేత్రాన్ని చూసుకుంటున్నారు.

సబ్‌స్టేషన్ ముట్టడించిన రైతులు

పంటలు ఎండిపోతున్నా పట్టించుకోవడం లేదంటూ నిరసన



రేగోడు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న మర్పల్లి రైతులు

రేగోడు డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పంటలు ఎండిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ గురువారం మెదక్ జిల్లా రేగోడు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద మర్పల్లి రైతులు ఆందోళన చేశారు. ఓ దశలో సిబ్బందిపై దాడి చేసేందుకు యత్నించారు. సబ్ స్టేషన్‌లోని ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. సబ్‌స్టేషన్ ఆఫీస్ భవనం ఎక్కిన రైతులు వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేసే వరకు దిగేది లేదంటూ నిరసన వ్యక్తం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి ఐదు రోజులవుతున్నా.. లైన్‌మన్ పట్టించుకోవడం లేదని, బోర్ల కింద వేసిన ఉల్లి, జొన్న, కూరగాయల పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న రేగోడు ఏఎస్ఐ మల్లయ్య సబ్‌స్టేషన్ వద్దకు వెళ్లి రైతులను నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. విద్యుత్ ఏఈ వచ్చి రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు చేపడుతామని చెప్పారు. దీంతో రైతులు దిగి వచ్చి లైన్‌మన్‌పై ఫిర్యాదు చేశారు. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే మారుస్తామని ఏఈ హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ ఆందోళన దాదాపు రెండు గంటల పాటు సాగింది.

ప్రజారోగ్యం, పరిశోధనా రంగాల్లో అపార అవకాశాలు

ఎమోరీ వర్సిటీ డైరెక్టర్ డాక్టర్ నిఖిల్ సింగ్లా



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ నిఖిల్ సింగ్లా

పటాన్‌చెరు రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యం, పరిశోధనా రంగాలలో ఫార్మసీ విద్యార్థులకు విశ్వవ్యాప్తంగా అపార అవకాశాలు ఉన్నాయని అమెరికాలోని ఎమోరీ విశ్వవిద్యాలయ భారతీయ పరిశోధనా, విద్యా ఆవిష్కరణల డైరెక్టర్ డాక్టర్ నిఖిల్ సింగ్లా అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీని ఆయన నేతృత్వంలోని ప్రతినిధి బృందం గురువారం సందర్శించింది. ఈ సందర్భంగా ఫార్మసీ విద్యార్థులతో నిర్వహించిన ముఖాముఖిలో డాక్టర్ నిఖిల్ మాట్లాడారు. విద్యార్థుల పరిధిని విస్తృతం చేసేందుకు, వారి విద్యా, వృత్తిపరమైన విషయాలలో అంతర్జాతీయ అవకాశాలను పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. ఎమోరీ విశ్వవిద్యాలయంతో సహకారంతో ఉమ్మడి పరిశోధనా కార్యక్రమాలు చేపట్టే వీలుందని ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ జగత్తరణ్ దాస్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమోరీ విశ్వవిద్యాలయం అడ్మిషన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఐవోన్ ఫోసీ, స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శివకుమార్, స్కూల్ ఆఫ్ సైన్స్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎం.రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియా బేగం, ఫార్మసీ అధ్యాపకులు డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి 244 మంది క్రీడాకారులు ఎంపిక



రాష్ట్ర స్థాయికి ఎంపికైన అత్యాపాత్య జట్టు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన సీఎం కప్ క్రీడల్లో జిల్లా నుంచి 244 మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. కిక్‌బాక్సింగ్, హాకీ, టేబుల్‌టెన్నిస్, బాస్కెట్‌బాల్, అత్యాపాత్య, వుష, ఫుట్‌బాల్, వాలీబాల్, హ్యాండ్‌బాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ జట్లు రాష్ట్ర స్థాయిలో వివిధ ప్రాంతాల్లో జరిగే ఎంపికల్లో తలపడనున్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన జట్లను జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి ఖాసీంబేగ్ దగ్గరుండి రాష్ట్ర స్థాయికి పంపి అభినందించారు.

సీఎస్ఐకి భక్తుల బారులు

రెండోరోజూ తగ్గని రద్దీ



చర్చి ప్రధాన ద్వారం వద్ద జనం

మెదక్ కల్చరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మెదక్ సీఎస్ఐ చర్చిలో క్రిస్మస్ రెండో రోజూ భక్తులు కిటకిటలాడారు. దీంతో చర్చి ఆవరణ మొత్తం ఏసు నామస్మరణతో మారుమోగింది. ఉదయం నుంచే భక్తుల సందడి కనిపించింది. ఇన్‌చార్జి బిషప్ రూబెన్ మార్క్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. భక్తులకు మతగురువుకు ఆశీర్వచనాలు అందజేశారు. శిలువ వద్ద భక్తులు కొవ్వొత్తులు వెలిగిస్తూ, కొబ్బరికాయలు కొడుతూ, తలనీలాలు సమర్పిస్తూ మొక్కులు తీర్చుకున్నారు. దూర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు ఆలయ ఆవరణలో విందు భోజనాలు చేస్తూ రోజంతా సరదాగా గడిపారు. మెదక్ డీసీసీ ప్రెసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య, చర్చి కమిటీ సభ్యులు గంట సంపత్, సాంసన్ సందీప్ భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

వ్యాపారులపాలిట కన్నీటి చినుకులు

మెదక్ సీఎస్ఐ చర్చిలో ఏసు జాతర సందర్భంగా చర్చి ఆవరణలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేశారు. క్రిస్మస్ రోజు అంతంత మాత్రంగానే వ్యాపారం జరగగా, రెండో రోజు బాగుంటుందని వ్యాపారులు ఆశించారు. కానీ, సాయంత్రం వర్షం కురవడంతో జనం తగ్గిపోయారు. ఏటా లక్షల్లో వ్యాపారం జరిగేదని, ఈసారి వ్యాపారం పూర్తిగా తగ్గిపోయిందని హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి దస్తగిరి ఖాన్ పేర్కొన్నారు. వర్షం వల్ల వ్యాపారం తగ్గిపోయిందన్నారు.

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

సంగారెడ్డి క్రైం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం కేసులో నేరం రుజువు కావడంతో దోషికి 20 సంవత్సరాల జైలు శిక్షతో పాటు పదివేల రూపాయల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయాధికారి కె.జయంతి గురువారం తీర్పు చెప్పారు. జిల్లా ఎస్పీ రూపేష్ తెలిపిన వివరాల ప్రకారం.. చౌటకూర్ మండలం ఉప్పరిగూడెం గ్రామానికి చెందిన అయ్యావారి రజనీకాంత్ (30) అదే గ్రామానికి చెందిన ఆరేళ్ల బాలికపై 2019 సెప్టెంబరు 9న అత్యాచారానికి పాల్పడ్డాడు. పుల్కల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరిపారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితునికి 20 సంవత్సరాల జైలు, రూ.10వేల జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు.

వలస కూలీ అదృశ్యం

రామచంద్రాపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ కూలీ అదృశ్యమైన ఘటన తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మహారాష్ట్ర గోంద్యాకు చెందిన సోమమంగళ గాత్రే(40) తెల్లాపూర్ లోని అతుల్యా హోమ్స్‌లో ఈ నెల 16న కూలీగా చేరాడు. 20న బయటకు వెళ్లిన గాత్రే తిరిగి రాలేదు. అతని గ్రామానికి చెందిన మోహన్ అనే కూలీ గాత్రే పలు చోట్ల వెతికి, స్వగ్రామానికి వెళ్లి ఉంటాడని భావించాడు. బుధవారం వరకు అతను స్వగ్రామానికి వెళ్లలేదని తెలుసుకుని కొల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రవీందర్ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కొండపాక, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం మర్పడగలో పేకాట ఆడుతున్న నలుగురిని త్రీ టౌన్ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. గ్రామంలోని దుర్గా సాయి తన షాప్‌లో అక్రమంగా బెల్ట్ షాప్ నడుపుతూ లిక్కర్ అమ్మడంతోపాటు పేకాట ఆడుతుండడంతో పోలీసులు దాడి చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న సాయి, కిష్టయ్య, మహేష్, కనకయ్య అనే నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2,230 నగదు, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. బెల్ట్ షాపు నడుపుతున్నందున అందులోని 11.62 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

కారులో రూ. 10 లక్షలు చోరీ

పట్టించిన సీసీ కెమెరాలు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, సీఐ

మునిపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి బుదేరా చౌరస్తాలోని తాజ్ దాబా వద్ద ఈనెల 16న ఓ కారులో ఉన్న రూ. 10లక్షలను దొంగలించిన దొంగలు సీసీ కెమెరాల ఆధారంగా దొరికారు. సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య గౌడ్, కొండాపూర్ సీఐ వెంకటేశ్, మునిపల్లి ఎస్ఐ రాజేష్ నాయక్‌లు సర్కిల్ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన అబ్దుల్ వాజిద్ ఈ నెల 16న కర్ణాటకకు కారులో వెళ్తూ మండలంలోని బుదేరా చౌరస్తాలోని తాజ్ దాబా వద్ద భోజనం చేసేందుకు ఆగారు. ఆయన దాబాలోకి వెళ్లగా, కారులో ఉన్న రూ. 10 లక్షలు ఎత్తుకెళ్లారు. ఈ మేరకు బాధితుడు మునిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన సీఐ వెంకటేశ్, ఎస్ఐ రాజేశ్‌నాయక్‌లు ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ అలీ ఖురేషి, అబ్దుల్ వహీద్, మహ్మద్ రహీం ఖాన్‌లు కారులో నుంచి డబ్బు తీసినట్లు తేలింది. వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా, దొంగతనం చేసినట్లు అంగీకరించారు. దీంతో వారిని రిమాండ్ తరలించి, వారి నుంచి స్వాధీనం చేసుకున్న నగదును బాధితుడికి అందించారు. చోరీ కేసును ఛేదించిన మునిపల్లి ఎస్ఐ రాజేష్ నాయక్, పోలీసు సిబ్బందిని డీఎస్పీ సత్తయ్య గౌడ్ అభినందించారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు యువకుల దుర్మరణం

- పొలానికి నీరు పెట్టి వస్తుండగా ఫ్లెక్సీ కట్టిన ఇనుప రాడ్ తగిలి షాక్
- మెదక్ జిల్లా కిష్టాపూర్‌లో అర్ధరాత్రి ఘటన
- ప్రమాదానికి సర్కారుదే బాధ్యత.. రూ.25 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలి: బీఆర్ఎస్ నేతలు



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే



నవీన్, ప్రశాంత్ (ఫైల్)

కొల్చారం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి వేళ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఇద్దరు యువకులు మృతి చెందారు. మెదక్ జిల్లా కొల్చారం మండలం కిష్టాపూర్ శివారులో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన అక్కెం నవీన్‌యాదవ్ (22), పసుల ప్రశాంత్ యాదవ్ (23) చిన్నప్పటి నుంచి స్నేహితులు. బుధవారం రాత్రి నారు మడికి నీరు పెట్టేందుకు ఇద్దరు కలిసి వెళ్లారు. పని అయిపోగానే తిరిగి ఇళ్లకు బయలుదేరారు. అయితే మార్గ మధ్యలో జాతీయ రహదారి పక్కన ఉన్న ఫ్లెక్సీ కట్టిన రాడ్ ఉండటం.. దానికి కరెంట్ సరఫరా జరగుతుండటం వారు గమనించలేదు. అయితే నవీన్ అనుకోకుండా ఆ రాడ్‌ను తగలడంతో విద్యుత్తు షాక్ తగిలింది. స్నేహితుడిని కాపాడేందుకు ప్రశాంత్ యాదవ్ యత్నించగా.. ఇద్దరు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. అటుగా వెళ్తున్న గ్రామస్థులు విషయం గమనించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారమిచ్చారు. మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్సై మహమ్మద్ గౌస్ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇద్దరు యువకులు ఒకేసారి చనిపోవడంతో గ్రామంలో విషాదం నెలకొంది. ప్రశాంత్ వివాహం వచ్చే నెలలోనే జరగాల్సి ఉంది. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి మెదక్ ఏరియా ఆస్పత్రికి వచ్చి బాధితులను ఓదార్చారు. అంత్యక్రియల కోసం రెండు కుటుంబాలకు రూ.25 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు.

కాంగ్రెస్ సర్కారుదే బాధ్యత: బీఆర్ఎస్

సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనలో భాగంగా విద్యుత్తు వైర్ల కింద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు తొలగిస్తుండగానే షాక్ తగిలి నవీన్, ప్రశాంత్‌లు మృతి చెందారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డి, ఆ పార్టీ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ఆరోపించారు. కిష్టాపూర్‌లో మృతుల కుటుంబాలను వారు పరామర్శించారు. యువకుల మృతికి పూర్తి బాధ్యత కాంగ్రెస్ సర్కారుదేనన్నారు. సీఎం స్పందించి మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ప్రాణాలు తీసిన ప్రమాదాలు

వేర్వేరు చోట్ల నలుగురు మృతి

కొండపాక, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లాలో బుధవారం రాత్రి నుంచి గురువారం రాత్రి వరకు వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు. ఇందులో కొన్ని ప్రమాదాలకు అతివేగమే కారణమని తెలుస్తోంది.

కొండపాక శివారులో రాజీవ్ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా, పలువురికి గాయాలు అయ్యాయి. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం మంగళగిరి గ్రామానికి చెందిన పలువురు వెల్మ సింధుజ(30), ఐట్ల లక్ష్మి, ఐట్ల సమీక్ష, దూస రమ, ఎలిగేటి మల్లేశం, నీరజ,షైని, మచ్చ నరేష్‌లు తవేరా జీపులో ఈనెల 24న రంగారెడ్డి జిల్లా అస్మాన్‌పల్లి గ్రామంలోని పిరమిడ్ ధ్యాన కేంద్రానికి వెళ్లారు. 25న రాత్రి తిరుగు ప్రయాణం అయ్యారు. ఈ క్రమంలో కొండపాక శివారులో వారి వాహనాన్ని గుర్తు తెలియని డీసీఎం వ్యాన్ ఓవర్ టేక్ చేసే క్రమంలో బలంగా ఢీ కొట్టింది. దీంతో జీపులో ఉన్న సింధుజ, మల్లేశం, నరేష్, శివానీలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ సింధుజ మృతి చెందింది. నరేష్‌ను హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. సింధుజ భర్త సతీష్ రెడ్డి ఫిర్యాదు మేరకు కుకునూరుపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు.. వ్యక్తి మృతి



వర్గల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వర్గల్ మండలం గౌరారం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయడిన వ్యక్తి గురువారం మృతి చెందాడు. గౌరారం ఎస్ఐ కరుణకర్‌రెడ్డి తెలిపిన వివరాల మెరకు ములుగు మండల కేంద్రానికి చెందిన ధోరణాల శ్రీకాంత్ (36) బుధవారం మధ్యాహ్నం తన ఆటోలో గజ్వేల్ మండలం బయ్యారం గ్రామంలో జరిగిన బంధువుల దశ దినకర్మకి వెళ్లి తిరిగి వస్తున్నాడు. రాత్రి గౌరారం సమీపంలోని మూల మలుపు వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. తీవ్రంగా గాయపడిన ఆయనను లక్ష్మక్కపల్లిఆర్వీఎం ఆసుపత్రికి తరలించగా గురువారం మధ్యాహ్నం మృతి చెందాడు.

కుక్కను తప్పించబోయి..

తూప్రాన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై వెళ్తున్న కుక్కను తప్పించబోయి, ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఓ వ్యక్తి మృతి చెందాడు. తూప్రాన్ మండలంలోని నాగులపల్లి శివారులోని 44వ జాతీయ రహదారి వద్ద గురువారం జరిగిన ఈ ఘటన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. మాసాయిపేట మండలంలోని నడిమితాండకు చెందిన మాలోత్ మంజ్యా(70) గురువారం మధ్యాహ్నం తన మోపెడ్‌పై తూప్రాన్‌కు బయలు దేరాడు. నాగులపల్లి శివారులోని కాఫీ డే వద్ద యూటర్న్ చేస్తుండగా అడ్డు వస్తున్న కుక్కను తప్పించబోయి అదుపుతప్పి కింద పడ్డాడు. తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అక్కడమృతి చెందాడు.

ఆగి ఉన్న వాహనాన్ని ఢీ కొని..

గజ్వేల్ రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న వాహనాన్ని వెనుక నుంచి వచ్చిన మరో వాహనం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన ప్రజ్ఞాపూర్‌లోని ఔటర్ రింగురోడ్డుపై చోటు చేసుకుంది. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని జగద్గిరిగుట్ట ప్రాంతానికి చెందిన మందుల ప్రదీప్ టాటాఏస్ ట్రాలీ వాహనంలో డ్రైవర్‌తో పాటు మరో 8 మంది పిల్లలతో కలిసి కుకునూరుపల్లి మండల మేధినీపూర్ గ్రామంలోని చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకలకు బుధవారం హాజరయ్యారు. తిరుగు ప్రయాణంలో ప్రజ్ఞాపూర్ ఔటర్ రింగ్‌రోడ్డుపై బాబాయ్ హోటల్ ముందు టీ తాగేందుకు వాహనాన్ని నిలిపారు. వాహనంలోని వారంతా హోటల్‌లోకి వెళ్లగా డ్రైవర్‌తోపాటు ప్రదీప్‌లు అందులోనే ఉండిపోయారు. ఇదే సమయంలో అక్కన్నపేట మండలం రాయవరం గ్రామానికి చెందిన శివగణేష్ రెడ్డి టాటాఏస్ వాహనంలో మిత్రుడైన సాయికుమార్‌రెడ్డిని వెంటబెట్టుకొని హుస్నాబాద్‌లో కోడిపిల్లలను నింపుకొని బీదర్ వెళ్లేందుకు బయలుదేరారు. ప్రజ్ఞాపూర్‌లోని ఔటర్‌రింగ్‌రోడ్డుపై బాబాయ్ హోటల్ ముందు ఆగి ఉన్న టాటాఏస్ వాహనాన్ని వెనుక నుంచి వచ్చి ఢీ కొట్టాడు. దీంతో వాహనం రోడ్డుపై దూసుకు వెళ్లి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో శివగణేష్‌రెడ్డి స్నేహితుడు సాయికుమార్‌రెడ్డి(22) అక్కడికక్కడే మృతి చెందాడు.

సొంత గూటికి వీఆర్వోలు

5వ పేజీ తరువాయి..

తీసుకొస్తామని ప్రకటించడంతో ఇతర శాఖల్లోకి వెళ్లిన వీఆర్వోలు సొంత శాఖకు రానుండడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం



రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని, భూ సమస్యల పరిష్కారానికి తీసుకొస్తున్న భూభారతి చట్టాన్ని ఆహ్వానిస్తున్నాం. కామన్ సీనియార్టీ పాత సర్వీస్‌తో కలిపి మినిస్టీరియల్ సర్వీస్ కింద తీసుకోవాలి. అర్హత ఉన్న వీఆర్వోలకు ప్రమోషన్ ఇవ్వాలి. రెవెన్యూ శాఖలో విలీనం తర్వాత ప్రభుత్వానికి వారధిగా పని చేయడానికి సిద్ధంగా ఉన్నాం.

\- రవీందర్, జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు

వివరాలు సేకరిస్తున్నాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు వీఆర్వోల వివరాలను సేకరిస్తున్నాం. ఈనెల 28 వరకు వివరాలు సేకరించి ఆ వివరాలను ప్రభుత్వానికి నివేదిక అందజేస్తాం. అనుభవం కలిగిన వ్యక్తులు రెవెన్యూశాఖకు వస్తే క్షేత్రస్థాయిలో భూసమస్యలకు పరిష్కారానికి సులువుగా ఉంటుంది.

-అబ్దుల్ హమీద్, జిల్లా అదనపు కలెక్టర్

వినియోగంలోకి తెండి సారూ..

- నిరుపయోగంగా పాత మున్సిపల్ కార్యాలయ భవనం
- ప్రైవేట్ భవనాల్లో పోస్టాఫీసు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు
- వాటిని ఇందులో ఏర్పాటు చేస్తే మున్సిపల్‌కు అందనున్న అద్దె
- మంత్రి పొన్నం ఆదేశాలను అమలు చేయాలంటున్న ప్రజలు



నిరుపయోగంగా ఉన్న పాత మున్సిపల్ కార్యాలయం

హుస్నాబాద్ టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయం నూతన భవనంలోకి మార్చడంతో ఇన్నాళ్లు సేవలందించిన పాత మున్సిపల్ కార్యాలయం నిరుపయోగంగా మారింది. విశాలమైన గదులు, సమావేశ మందిరం, ఆవరణ ఉన్న ఈ కార్యాలయాన్ని వినియోగంలోకి తేవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మున్సిపల్ కార్యాలయాన్ని నూతన భవనంలోకి మార్చిన వచ్చిన దృష్ట్యా పాత భవనాన్ని సబ్ పోస్టాఫీసు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను పాత భవనంలోకి తీసుకరావాలని, అందుకు అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నవంబరు 28వ తేదీన నూతన మున్సిపల్ కార్యాలయం ప్రారంభం కాగా, దాదాపు 23 రోజులు గడుస్తున్నా ఇప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టలేదు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత ఈ భవనాన్ని వినియోగించుకోవాలని సంబంధిత అధికారులకు లేఖలు రాసినా వారి నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ప్రస్తుతం పోస్టాఫీసు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వాటిని పాత మున్సిపల్ కార్యాలయ భవనంలో ఏర్పాటు చేస్తే అదే అద్దె మున్సిపాలిటీకి అంది అదనపు ఆదాయం చేకూరే అవకాశం ఉంటుంది.

అద్దె భవనాల్లో పోస్టాఫీసు, సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు..

హుస్నాబాద్ పట్టణంలోని సబ్ పోస్టాఫీసు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. దాదాపు 10 సంవత్సరాలకు పైగా ఈ భవనాలకు అద్దె చెల్లిస్తున్నారు. పోస్టాఫీసు సిద్దిపేట రోడ్డులో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అక్కన్నపేట రోడ్డులో ఉన్నాయి. ఈ రెండు కార్యాలయాల మధ్య కిలోమీటరు దూరం వరకు ఉంటుంది. పోస్టాఫీసుకు రూ. 5 వేలు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి రూ. 5,500 అద్దె చెల్లిస్తున్నారు. ఈ రెండు కార్యాలయాలను మున్సిపల్ పాత కార్యాలయంలోకి మార్చితే ప్రజలకు అక్కడ రెండు శాఖల సేవలు అందుతాయి. ఆదే కాకుండా దాదాపు రూ. 10,500 ఆదాయం మున్సిపల్‌కు సమకూరడమే కాకుండా భవనం నిరూపయోగంగా ఉండకుండా వినియోగంలోకి వస్తుందని ప్రజలు పేర్కొంటున్నారు.



మచ్చవానికుంట బతుకమ్మ మెట్లను తాకిన గుర్రపుడెక్క

చెరువులపై నిర్లక్ష్యమేలా..!

5వ పేజీ తరువాయి..

కేటాయించినప్పటికీ ఆ స్థాయిలో పనులు చేపట్టకుండా మొక్కుబడిగా ముగించినట్లు అవగతమవుతోంది.

ప్రమాదకరంగా గుర్రపుడెక్క..

చెరువుల్లో విస్తరిస్తున్న గుర్రపుడెక్క ప్రమాదకరంగా మారుతోంది. నీటి సరఫరాకు ఇబ్బందులు లేకున్నప్పటికీ చేపల పెంపకానికి తీవ్ర అవరోధంగా మారుతోంది. మత్స్యకారుల జీవనోపాధిపైనా ఈ మొక్కలు ప్రభావం చూపిస్తున్నాయి. ఇక ఎవరైనా చెరువులోకి ఈతకు వెళ్లినా, ఇతర అవసరాలకు దిగినా గుర్రపుడెక్కలో చిక్కుకుపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. తాజాగా బాలుడి మరణం వెనుక కూడా ఇదే దాగి ఉంది. గుర్రపుడెక్కను తొలగించాల్సిన అధికారులు ఇటువైపు కన్నెత్తికూడా చూడడం లేదు. కనీసం చెరువుల వద్ద హెచ్చరిక బోర్డులు పెట్టాలని స్థానికులు కోరుతున్నారు. లేదంటే మరికొందరి ప్రాణాలకు ముప్పు తప్పదని హెచ్చరిస్తున్నారు.

అదృశ్యమైన బాలుడు.. చెరువులో శవమై..

- పతంగి ఎగరేస్తూ వెళ్లి మృత్యువాత



తేజకుమార్ మృతదేహం

సిద్దిపేట క్రైం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్నేహితులతో కలిసి ఆడుకుంటానని చెప్పి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి అదృశ్యమైన బాలుడు చెరువులో శవమై తేలిన ఘటన సిద్దిపేట పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. సిద్దిపేట వన్ టౌన్ సీఐ వాసుదేవరావు తెలిపిన వివరాల ప్రకారం అల్లెపు లింగం, పద్మ దంపతులు తమ కుటుంబంతో కలిసి పట్టణంలోని లెక్చరర్స్ కాలనీలో నివాసం ఉంటున్నారు. లింగం కుమారుడు అల్లెపు తేజకుమార్ (11) ఐదవ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 24 న మధ్యాహ్నం తేజకుమార్ స్నేహితులతో ఆడుకుంటానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలుడిని స్నేహితులను ఆరా తీయగా పతంగి ఎగరేస్తూ వెళ్లాడని తెలిపారు. బీడీ కాలనీలోని మత్స్యవారి కుంట చెరువులో పతంగి కనిపించడంతో అనుమానంతో గురువారం గాలించగా బాలుడి మృతదేహం లభించింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సిద్దిపేట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ బాధిత కుటుంబానికి పరామర్శించి తక్షణ సాయం కింద రూ.5వేలు అందజేశారు. ప్రభుత్వం నుంచి సాయం అందేలా కృషి చేస్తానన్నారు.

భారత స్వాతంత్ర్య ఉద్యమంలో సీపీఐది కీలక పాత్ర

- సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు బట్టు దయానంద్‌రెడ్డి
- జిల్లావ్యాప్తంగా పార్టీ 100వ ఆవిర్భావ ఉత్సవాలు



చేర్యాలలో సీపీఐ జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు అందె అశోక్

జగదేవ్‌పూర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత స్వాతంత్ర్య ఉద్యమంలో భారత కమ్యూనిస్టు పార్టీ కీలక పాత్ర పోషించిందని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు బట్టు దయానంద్‌రెడ్డి అన్నారు. సీపీఐ 100వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జగదేవ్‌పూర్ మండలంలో తిగుల్ గ్రామంలో అరుట్ల భవనం ఎదుట సీపీఐ జెండాను ఎగురవేసి భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో కమ్యూనిస్టు పార్టీకి ప్రత్యేకత ఉందని, పేద వర్గాల కోసమే పార్టీ ఆవిర్భవించిందని వివరించారు. 1925లో ఖాన్‌పూర్ పట్టణంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించిందని వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి నర్సింహారెడ్డి, గ్రామ కార్యదర్శి భిక్షపతి, పీఏసీఎస్ డైరెక్టర్ భూమయ్య, నాయకులు పాల్గొన్నారు.

- గజ్వేల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని పల్లెపహాడ్‌లో పార్టీ గ్రామ కార్యదర్శి కొండకింది పోచయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఐ పార్టీ కార్యదర్శి శివలింగు కృష్ణ పాల్గొని జెండాను ఆవిష్కరించారు.
- కోహెడ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) :మండల కేంద్రంలో సీపీఐ జెండాను పార్టీ మండల కార్యదర్శి ముంజ గోపి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి శంకర్, లక్ష్మణ్, గాజుల రాజేశం, వేల్పుల మల్లయ్య, చల్ల సత్తిరెడ్డి పాల్గొన్నారు.
- బెజ్జంకి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు పొతిరెడ్డి వెంకట్‌రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. సీపీఐ మండల కార్యదర్శి రూపేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మధు, ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి మహేశ్, అశోక్‌రావు, డీహెచ్‌పీఎస్ మండల కార్యదర్శి చరణ్ పాల్గొన్నారు.
- చేర్యాల, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి) : చేర్యాల, కొమురవెల్లి మండలాలలో గ్రామగ్రామాన పార్టీ జెండాలను ఆవిష్కరించారు. జిల్లా కౌన్సిల్ సభ్యుడు అందె అశోక్, నాయకులు పాల్గొన్నారు.

ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఫణిందర్ గౌడ్



సిద్దిపేట రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నారాయణరావుపేట మండల కేంద్రానికి చెందిన జిల్లెల్ల ఫణిందర్ గౌడ్ ఎంపికయ్యారు. సిద్దిపేటలో జరుగుతున్న 43వ రాష్ట్ర మహాసభలలో ఆయనను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పణిందర్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర శాఖ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడతానని, విద్యారంగా, సామాజిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

వేం నరేందర్‌రెడ్డిని కలిసిన 'మొగుళ్ల'



చేర్యాల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం వీరన్నపేట గ్రామానికి టీపీసీసీ అధికార ప్రతినిధి మొగుళ్ల రాజిరెడ్డి గురువారం హైదరాబాదులో ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటుతో పాటు జనగామ నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై చర్చించారు.

అవినీతిపై విచారణ జరపాలి

ధూళిమిట్ట, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాపూర్ ఐకేపీ వడ్ల కొనుగోలు కేంద్రం, గ్రామ మహిళా సంఘాలలో జరిగిన అవినీతిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకొవాలనీ కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గద్దల మహేందర్ గురువారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... లింగాపూర్ గ్రామంలో ఐక్య సంఘం ద్వారా నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రంలో భారీగా అక్రమాలు, నిధుల గోల్‌మాల్ జరిగిందని ఆరోపించారు. అలాగే గ్రామంలోని మహిళా సంఘాలకు సంబంధించిన డబ్బులను ఇష్టానుసారంగా సంబంధం లేని వ్యక్తుల అకౌంట్లకు బదిలీ చేశారన్నారు. తక్షణమే జిల్లా స్థాయి అధికారులు స్పందించి బహిరంగా సమగ్ర విచారణ జరపాలన్నారు. ఈ విషయంపై మండల స్థాయి అధికారులను వివరణ కోరగా లింగాపూర్ గ్రామ ఐకేపీ,మహిళ సంఘాల నిర్వాహకులు ప్రస్తుతం దైవ దర్శనానికి వెళ్లారని రాగానే విచారణ చేసి తప్పు జరిగి ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు.

పుస్తె మట్టెల బహూకరణ

ధూళిమిట్ట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జాలపల్లికి చెందిన గుండెల్లి సత్తమ్మ, కనకయ్య కుమార్తె వివాహానికి తాజా మాజీ జెడ్పీటీసీ గిరి కొండల్ రెడ్డి రూ.15 వేల ఆర్థిక సాయం గురువారం అందించారు. యూత్ కాంగ్రెస్ జనగామ జిల్లా ఉపాధ్యక్షుడు కమలాకర్ యాదవ్ దంపతులు పుస్తె మట్టెలను బహూకరించారు. గ్రామశాఖ అధ్యక్షుడు సాగర్‌గౌడ్, మాజీ సర్పంచ్ గంగాధర్, కనకయ్య, వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుదర్శన నారసింహ హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సిద్దిపేట రూరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు బండ పై స్వయంభూ లక్ష్మీ నరసింహ స్వామి క్షేత్రంలో నరసింహ స్వామి జన్మ నక్షత్రం స్వాతీ నక్షత్ర ఉత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. స్వామి జన్మ నక్షత్రం అయిన స్వాతి నక్షత్రం రోజున ప్రతినెలా ఇక్కడ సుదర్శన నరసింహ హోమం, స్వామి వారికి పంచ కలశ అభిషేకం నిర్వహిస్తారు. అందులో భాగంగా స్వాతి నక్షత్ర ఉత్సవం ఘనంగా నిర్వహించారు. దేవాలయ వంశ పారంపర్య అర్చకులు కలకుంట్ల రంగాచార్యులు, పొడిచేటి శ్రీనివాసాచార్యులు, లక్ష్మీనర్సింహ చార్యులు, విజయ్ చార్యులు, కలకుంట్ల నచికేత్‌ల ఆధ్వర్యంలో ఉత్సవం నిర్వహించారు. అందులో భాగంగా స్వయం భూ లక్ష్మీ నరసింహ స్వామికి పంచామృతాలతో వేద మంత్రాల మధ్య పంచ కళశ అభిషేకం నిర్వహించారు. అనంతరం దేవాలయం ప్రాంగణంలో సుదర్శన నారసింహ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవంలో పాల్గొన్న భక్తులకు పుల్లూరు గ్రామానికి చెందిన ఒగ్గు మురళీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఉత్సవంలో ప్రముఖ వాపారవేత్త ఐత నాగరాజు, పుల్లూరు గ్రామ ప్రజలతో పాటు ఆయా గ్రామాల భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ పనులు ప్రారంభించాలని ధర్నా



ధర్నా అనంతరం ఏఈకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

చేర్యాల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామంలో సబ్‌స్టేషన్ నిర్మాణం పనులు వెంటనే ప్రారంభించాలని డిమాండ్‌చేస్తూ సీపీఎం నాయకులు గురువారం కొమురవెల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా ఆ పార్టీ నాయకుడు తేలు ఇస్తారి మాట్లాడుతూ మండలంలోని అతి పెద్ద గ్రామం కావడంతో పాటు ధాన్యం అధికంగా పండిచే ఐనాపూర్‌లో లో-ఓల్టేజీ వలన ట్రాన్స్‌ఫార్మర్లు తరచూ కాలిపోతుండటం, చిరుగాలులు వీచినా విద్యుత్ సరఫరా నిలిచిపోతుండటంతో రైతులు ఇబ్బందులుపడుతున్నారన్నారు. కొన్నాళ్లక్రితం బీఆర్ఎస్, ప్రస్తుతం కాంగ్రెస్ నేతలు సబ్‌స్టేషన్‌ను తామంటే తాము మంజూరుచేశామని ప్రకటనలు చేశారే తప్ప ఎలాంటి పనులు చేపట్టలేదన్నారు. గ్రామంలో రైతులు వ్యవసాయం పనులు ముమ్మరం చేస్తున్న నేపథ్యంలో విద్యుత్ అవాంతరాలు తలెత్తకుండా సబ్‌స్టేషన్ నిర్మాణం పనులు వెంటనే పా్రరంభింపచేసి త్వరితగతిన అందుబాటులోకి తీసుకుచ్చేలా చర్యలు తీసుకోవాలని, లేనియెడల ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. అనంతరం ఏఈకి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు సున్నం యాదగిరి, కానుకుల రాజు, ఎల్లయ్య, గోరెమియా, చంద్రయ్య, అంజయ్య, రాజు పాల్గొన్నారు.

ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్ట్ హేయనీయం

చేర్యాల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ అసమర్థపాలనను ఎండగడుతూ ప్రశ్నిస్తున్నారన్న అక్కసుతో టీఎస్ఎంఐడీసీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను అక్రమంగా అరెస్ట్ చేయడం హేయనీయమని బీఆర్ఎస్ కొమురవెల్లి మండల నాయకుడు ఏర్పుల మహేశ్ అన్నారు. కొమురవెల్లి మండలకేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దళితుల సమస్యల కోసం, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల అమలు కోసం గళమెత్తిన ఎర్రోళ్ల శ్రీనివాస్‌పై బనాయించిన కేసును ఉపసంహరించుకుని వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

- గజ్వేల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను గజ్వేల్ బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు దేవీ రవీందర్, ఎం.శ్రీనివాస్‌లు పరామర్శించారు. మాసబ్‌ట్యాంక్ పోలీస్‌స్టేషన్‌లో ఉన్న ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను పరామర్శించిన వారు మాట్లాడుతూ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులపై ఉక్కుపాదం మోపుతుందని, నిర్బంధ కాండను ప్రదర్శించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. వారివెంట నాయకులు నూనె కుమార్‌యాదవ్, పాల రమేశ్‌గౌడ్ తదితరులున్నారు.

ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టిన వ్యక్తి .. తీవ్ర గాయాలు



దౌల్తాబాద్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యో) : ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్న ద్విచక్రవాహనదారుడుకి తీవ్రగాయలైన సంఘటన దౌల్తాబాద్ మండల శివారులోని పెద్దగుడి సమీపంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని శేరిపల్లికి చెందిన బుచోళ్ల బాలు(38) దౌల్తాబాద్ నుంచి శేరిపల్లికి ద్విచక్రవానంపై వస్తున్నాడు. దౌల్తాబాద్ శివరారులోని రోడ్డు పక్కన సిమెంట్ ఇటుకల ట్రాక్టర్‌ను డీజిల్ అయిపోవడంతో నిలిపారు. ఇది గమనించని బాలు వేగంగా బైక్‌తో ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో అతడి తలకు తీవ్ర గాయలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని బాలును పోలీస్ వాహనంలో గజ్వేల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

ఉచిత వైద్య శిబిరం అభినందనీయం

కోహెడ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదల ఆరోగ్య పరిరక్షణకు లయన్స్ క్లబ్, బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరం అభినందనీయమని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మంద ధర్మయ్య, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గంగం సంతోష్ రెడ్డి అన్నారు. గురువారం కోహెడలో సురభి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కోహెడ, బెజ్జంకి మండలాలకు చెందిన ప్రజలు హాజరై శిబిరంలో 200 మందికి పైగా ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్, మాజీ సర్పంచ్ మంద రాజయ్య, మాజీ ఎంపిటిసి బోయిని జయరాజ్, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీనాథ్ ఉన్నారు.

ఆకునూరులో..

చేర్యాల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలో మేడ్చల్ మెడిసిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. 120మందికి షుగర్, బీపీ నిర్ధారణ పరీక్షలు జరిపారు. వీరిలో ఆపరేషన్లతో పాటు ఉన్నత పరీక్షలు అవసరమున్న 31మందిని మెడిసిటీ హాస్పిటల్‌కు తరలించారు. వీరందరికి ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు నిర్వహకులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు పీత్రూ, ఆశిష్, భార్గవ్, గణేశ్, రుద్రదదత, దుర్గేందర్, మిత్రా పాల్గొన్నారు.

కఠిన నిబంధనలు తొలగించాలి

- డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి

గజ్వేల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు ప్రక్రియలో కఠిన నిబంధనలు తొలగించాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఖాళీ స్థలాలు ఉన్న వారు ఇళ్లు కట్టుకునేందుకు నిధులు ఇస్తామని చెబుతున్న ప్రభుత్వం ఇళ్ల స్థలాలకు సంబంధించిన కాగితాలను అడగడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ఈ నిబంధన వలన పేదలకు ఇళ్లు అందకుండా పోయే అవకాశం ఉందని, ఈ నిబంధనలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఆయనవెంట నాయకులు చంద్రం, సతీష్‌కుమార్, సాయిలు తదితరులున్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత




బాధితులకు చెక్కులు అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి

గజ్వేల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే, డీసీసీ ప్రెసిడెంట్ నర్సారెడ్డి స్వగృహంలో పలువురు బాధితులకు గురువారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. గజ్వేల్ మండలం జాలిగామ గ్రామానికి చెందిన తాళ్ల లావణ్యకు రూ.60వేలు, మంగలి అరుణకు రూ.60వేలు, ర్యాగట్లపల్లి గ్రామానికి చెందిన సాయికుమార్‌కు రూ.60వేలు, వేములఘాట్ గ్రామానికి చెందిన కవితకు రూ.60వేల విలువగల చెక్కులు మంజూరాయ్యాయి. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి ఆదేశాల మేరకు గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ పంపిణీ చేశారు.

- జగదేవ్‌పూర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్ మండలం తిగుల్ గ్రామానికి చెందిన వలబోజు విఠల్ విఠల్‌కు రూ. 41,500, రాములుకు రూ. 60వేల సీఎంఆర్ఎఫ్ మంజూరయ్యాయి. ఆ చెక్కులను గురువారం బాధిత కుటుంబాలకు మాజీ ఎంపీటీసీ మంజుల మహేందర్‌రెడ్డి అందించారు.

కేవల్ కిషన్ స్ఫూర్తితోనే ప్రజా ఉద్యమాలు

- సీపీఎం జిల్లా కార్యదర్శి సందబోయిన ఎల్లయ్య



గజ్వేల్ : కిషన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

గజ్వేల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధుడు అమరజీవి కేవల్ కిషన్ స్ఫూర్తితోనే సిద్దిపేట జిల్లాలో ప్రజా ఉద్యమాలు చేపడుతున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సందబోయిన ఎల్లయ్య అన్నారు. కేవల్ కిషన్ వర్ధంతి సందర్భంగా సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బండ్ల స్వామి, రంగారెడ్డి, వెంకటాచారి, ఐలయ్య, రాణి, రాజు, ప్రవీణ్ తదితరులున్నారు.

- దుబ్బాక, డిసెంబరు26 (ఆంధ్రజ్యోతి): నమ్మిన సిద్ధాంతం కోసం నిరంతరం పనిచేసిన గొప్పవ్యక్తి కామ్రేడ్ కెవల్‌కిషన్ అని సీపీఎం దుబ్బాక మండల కార్యదర్శి సింగిరెడ్డి నవీనా కొనియాడారు. గురువారం దుబ్బాక సీపీఎం కార్యాలయంలో కామ్రేడ్ కెవల్‌కిషన్ 64వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలను వేసి ఘన నివాళులను అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు భాస్కర్, సాజిద్, రాజు, మల్లేశం తదితరులున్నారు.

డ్రగ్స్ విక్రయిస్తే కఠిన చర్యలు

దుబ్బాక, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎవరైనా సరే గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని దుబ్బాక సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. గురువారం దుబ్బాక పట్టణంలో, వాబ్బిపూర్ గ్రామంలోని పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు డాగ్‌స్క్వాడ్‌తో కలిసి పాన్, కిరాణ దుకాణాల్లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిసలై వారివారి కుటుంబాలను రోడ్డున పడేయొద్దని తెలిపారు. ఎవరైనా మత్తు పదార్థాలను పోలీసులకు సమాచారం అందించాలని న్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట పోలీస్‌సిబ్బంది తదితరులున్నారు.



దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ శ్రీనివాస్

ఎట్టకేలకు షురూ..



పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం తొలగింపుతో శుభ్రంగా కనిపిస్తున్న మద్దూరు పీహెచ్‌సీ పరిసరాలు, కొనసాగుతున్న చెట్ల తొలగింపు (ఇన్‌సెట్లో)

మద్దూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మద్దూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సందుదీకరణ పనులు ఎట్టలకే షురూ అయ్యాయి. ఇక్కడ నెలకొన్న సమస్యల పరిష్కారానికి రెండేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధుల కింద రూ. 25 లక్షలు మంజూరు చేసింది. అయినా పనులు ప్రారంభంలో జాప్యం జరిగింది. ఎట్టకేలకు కాంట్రాక్టర్ పనుల ప్రారంభానికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం పీహెచ్‌సీ చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కల తొలగింపు పనులు జరుగుతున్నాయి. ఇక బిల్డింగ్‌కు పెయింటింగ్‌తో పాటు లోపల విద్యుత్, శానిటేషన్, నీటి సరఫరాతో పైప్‌లైన్, పెయింటింగ్ పనులు చేట్టాల్సి ఉంది. ఈ పీహెచ్‌సీ పరిధిలో 14,664 జనాబా ఉండగా మద్దూరు, గాగిళ్లాపూర్, ధూళిమిట్ట అర్జునపట్ల గ్రామాల్లో సబ్ సెంటర్లు ఉన్నాయి. 7గురు ఏఎన్ఎంలు, 14 మంది ఆశాలు పని చేస్తున్నారు.